# మనవేమన పద్యములు

గత సంచికలో వలెనే ఈసారి కూడా రెండు పద్యములను వాటి తాత్పర్యములను అందజేస్తున్నాము. ఒకటి ఎక్కువగా ప్రాచుర్యము పొందినది, రెండవది ఎక్కువగా విననిది. పిల్లలకి నేర్పడము మరువకండి.

అనువుగాని చోట నధికుల మనరాదు
గొంచెమైన నదియుఁ గొదువగాదు
కొండయద్దమందుఁ గొంచెమై యుండదా
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యము: వీలుకాని చోట అధికుడనని ప్రగల్భములు బలుకరాదు. సామాన్యముగ నుండుట చిన్నతనమూ గాదు. అద్దములో కొండ చిన్నదిగా కన్పించిననూ నిజానికి చిన్నది కాదుగదా.

మనన వృత్తి బూని మౌన సమాధిలో
తనదు జ్ఞప్తి మరచి తాల్మితోడ
పెంపు చెందువాడె ప్రియ భక్తుడగునయా
విశ్వదాభిరామ వినురవేమ!

మనన వృత్తి - మంచి ఆలోచనలను చేయడము పనిగా
బూని - చేపట్టి
మౌన సమాధిలో - ఆలోచనలనుండి బయటపడి, నిశ్చలమైన మనసుతో
తనదు జ్ఞప్తి మరచి - తన జ్ఞాపకాలను విడిచిపెట్టి
తాల్మితోడ - ధైర్యముతో
పెంపు చెందువాడె - మానసికముగా ఉన్నత స్థితి పొందినవాడె
ప్రియ భక్తుడగునయా - ఇష్టుడైన భక్తుడుగా అవ్వగలడు

తాత్పర్యము : దేవుని భక్తుడగుటకు నిశ్చలమైన మనస్సు, సాధన, ఏకాగ్రత అవసరమని చెప్పడములో వేమన చెప్పిన పై పద్యములో - మన మనస్సును నిష్కల్మషముగా ఉంచడానికి మంచి ఆలోచనలను చేయడమే పనిగా సాధన చెయ్యాలి. ఇది ప్రాథమిక సాధన. ఇక మౌనము రెండవ స్థితి. మౌనము అంటే ఎవరితో మాట్లాడకుండా సైగలతో పొద్దు బుచ్చడము కాదు. ఆలోచనలను నియంత్రించడము. ఇక మూడవ స్థితి సమాధి. బయటి ప్రపంచములో ఏమి జరుగుతున్నదో నన్న విచారము (ఆలోచన) వదలి ఏకాగ్రత సాధించడము. ఇక చివరిగా ప్రపంచవిషయాలు వదిలినా అతి కఠినమైనది తన జ్ఞాపకాల గురించి మరచిపోవడము. ఇది చివరిదైన ఉన్నత దశ. ఈ దశకు చేరిన వ్యక్తి దేవునికి అత్యంత ప్రియ మైన భక్తుడు అవ్వడములో ఆశ్చర్యము ఏముంది?